క్లుప్తంగా

వీరేశ్వరుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి నరసింహ చక్రవర్తి దంపతులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి బొప్పన వరాహలక్ష్మి నరసింహ చక్రవర్తి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు యనమండ్ర సవిత్ర తేజ వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుల వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు న్యాయమూర్తి దంపతులకు పట్టు వస్త్రాలు, స్వామి వారి చిత్ర పటం, ప్రసాదం అందజేశారు.

విఘ్నేశ్వరునికి అష్ట ద్రవ్యాభిషేకాలు



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

అమలాపురం రూరల్: పాత బండారులంక గ్రామంలో వేంచేసియున్న భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పవిత్ర సంకట హర చతుర్థి సందర్భంగా విఘ్నేశ్వరునికి ఆలయ అర్చకుడు గుమ్మడి సద్గురు సత్యనారాయణ అష్ట ద్రవ్యాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం 6 గంటలకు సంకటహర చతుర్థి పూజలు, లడ్డూ ప్రసాదం వితరణ, అఖండ దీపారాధన నిర్వహించారు.

వాటర్ కూలర్ బహూకరణ



ఆలయానికి వాటర్ కూలర్ బహూకరిస్తున్న గోపి దంపతులు

అమలాపురం టౌన్: స్థానిక చెన్న మల్లేశ్వర స్వామి ఆలయానికి రూ.30 వేల విలువైన వాటర్ కూలర్‌ను గోకరకొండ గోపి దంపతులు బహూకరించారు. ఆలయ చైర్మన్ కల్వకొలను బాబి సమక్షంలో వాటర్ కూలర్‌ను ఆదివారం అందజేశారు. వేసవిలో ఆలయానికి వచ్చే భక్తులకు చల్లని పరిశుభ్రమైన తాగు నీటిని అందించే వెసులుబాటు కలుగుతుందని ఆలయ చైర్మన్ బాబి అన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు ఉద్దేశపు వెంకన్న, దున్నాల బాబి, అరిగెల పల్లంరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



బాధితులకు సామాన్లు అందిస్తున్న రాష్ట్ర దేవాంగ మహిళా సంఘం ప్రతినిధులు

అమలాపురం రూరల్: బండారులంక పేరివారి కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చందన సత్యనారాయణ, దొడ్డిపట్ల పల్లాలమ్మ కుటుంబాలకు కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యస్వామి చేతుల మీదుగా రూ.25 వేల విలువైన బీరువా, స్టూళ్లు, దిండులు ఆదివారం అందజేశారు. ఆయా వస్తువుల్ని రాష్ట్ర దేవాంగ మహిళా సంఘం సమకూర్చిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ మహిళా సంఘం ప్రతినిధులు ఉప్పుగంటి రాజశ్రీ, నక్కిన విజయలక్ష్మి, ఎ.శ్యామల, సంఘం ప్రధాన కార్యదర్శి పుత్సల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 500 మందికి పరీక్షలు

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ పరిధిలోని చిన వలసల పాఠశాల వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. తాళ్లరేవు బైపాస్‌లోని సూర్య మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్యులు ఎం.సురేష్‌బాబు, ధర్మేంద్రలు రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అధినేత మచ్చా గంగాధర్‌రావు విలేకర్లతో మాట్లాడుతూ శివారు ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అదనపు వంతెనలతో మార్గం సుగమం

- జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్
- రూ.10 కోట్లతో మూడు ప్రత్యామ్నాయ వంతెనలు
- మంత్రి విశ్వరూప్ ఆదేశాలతో సిద్ధమైన ప్రణాళికలు



అమలాపురం పట్టణ ప్రవేశమైన ఈదరపల్లి వంతెన వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం... కోనసీమ కొత్త జిల్లాగా ఏర్పాటయ్యాక జిల్లా కేంద్రమైంది. రోజురోజుకీ పెరుగుతున్న జనాభాతో పాటు ఉపాధి అవకాశాల నిమిత్తం అమలాపురం వచ్చిపోయేవారి సంఖ్య సైతం అదే స్థాయిలో వృద్ధి చెందుతోంది. ఫలితంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా పట్టణ ముఖ ద్వారాలైన ఈదరపల్లి వంతెన, నల్ల వంతెన, ఎర్ర వంతెనల వద్ద నిత్యం ట్రాఫిక్ నిలిచిపోయి వాహన చోదకులు అవస్థలు పడడం సర్వసాధారణంగా మారిపోయింది.

జిల్లా కేంద్రంపై ట్రాఫిక్ తీవ్రతను తగ్గించేందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదేశాలతో రూ.10 కోట్లతో మూడు ప్రత్యామ్నాయ వంతెనల నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

అమలాపురం పట్టణంలోకి ప్రవేశించాలన్నా, పట్టణంలోంచి బయటకు వెళ్లాలన్నా ఈదరపల్లి వంతెన, నల్ల వంతెన, ఎర్ర వంతెనలే కీలకం. ఈ మూడు వంతెనలు దాదాపు అయిదు దశాబ్దాల కిందట నిర్మించినవే. పట్టణంలో పెరిగిన ట్రాఫిక్‌కి తగ్గట్టుగా వంతెనల సామర్థ్యం సరిపోక ఇరుకిరుకుగా మారి నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఈ మూడు వంతెనల వద్ద నిత్యం ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. అందుకే ప్రస్తుతమున్న వంతెనల పక్కనే అదనపు వంతెనలు నిర్మిస్తేనే ట్రాఫిక్ సమస్య తీరుతుందని పట్టణ ప్రజల నుంచి డిమాండ్ వినిపిస్తుంది.

మంత్రి విశ్వరూప్ ప్రత్యేక దృష్టి

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్పందించడంతో పాటు జిల్లా కేంద్రమైన అమలాపురాన్ని ట్రాఫిక్ భారం నుంచి కాపాడేందుకు ప్రత్యామ్నాయ వంతెనలు అత్యవసరమని మంత్రి పినిపే విశ్వరూప్ భావించారు. తక్షణమే ఇంజినీర్లతో ఈదరపల్లి వంతెన, నల్ల వంతెన, ఎర్ర వంతెనలకు పక్కనే అదనంగా రెండో వంతెనల నిర్మాణాలకు అంచనాలు రూపొందించమంటూ ఆదేశాలు జారీచేశారు. తొలుత పక్కా వంతెనలు కాకుండా మూడు చోట్ల మూడు బెయిలీ బ్రిడ్జిలను రూ.75 లక్షలతో తాత్కాలిక పద్ధతిలో నిర్మిస్తే బాగుంటేదేమోనని అధికారులు యోచించారు. అయితే బెయిలీ బ్రిడ్జిలపై హెవీ వెహికల్స్ కాకుండా కార్లు, ఆటోలు, మోటారు సైకిళ్లు మాత్రమే వెళ్లే సామర్థ్యం మాత్రమే ఉంటుంది. పైగా బెయిలీ బ్రిడ్జిలతో తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వత పరిష్కారం లభించదని మంత్రి విశ్వరూప్ తిరస్కరించినట్లు తెలుస్తుంది. దీంతో రూ.10 కోట్లతో ఒక్కో వంతెన వద్ద ఒక్కో ప్రత్యామ్నాయ వంతెన నిర్మించేందుకు నిర్ణయించి అంచనాలు రూపొందించారు.

నిధులు త్వరితగతిన వచ్చేలా చూస్తా



జిల్లా కేంద్రంలో పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా ఈదరపల్లి వంతెన, నల్ల వంతెన, ఎర్ర వంతెనల వద్ద అదనపు వంతెనల నిర్మాణానికి రూ.10 కోట్లతో అంచనాలు తయారు చేయించాం. త్వరలోనే సమస్య తీవ్రతను ముఖ్యమంత్రి జగన్ దృష్టిలో పెట్టి నిధులు త్వరితగతిన వచ్చేలా చూస్తాను.

– పినిపే విశ్వరూప్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం

దళితుడిపై టీడీపీ నేత కుమారుడి దాడి

ఉప్పలగుప్తం: తండ్రి సర్పంచ్ అనే గర్వంతో ఓ టీడీపీ నాయకుడి కుమారుడు దళితుడిపై దౌర్జన్యానికి దిగి చితకబాదిన ఘటన మండలంలో వానపల్లిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. తెలుగుదేశం పార్టీ నాయకుడు, ప్రస్తుత గ్రామ సర్పంచ్ అయిన నల్లా వెంకటేశ్వరరావు (బాబండి) కుమారుడు నల్లా నవీంద్ర (బాబి) కులం పేరుతో దూషిస్తూ తనను కొట్టాడని ఆదివారం ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు గుండారపు రాజు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. కాట్రేనికోన మండలం పల్లం పంచాయతీ గోపాలరావుపేటకు చెందిన గుండారపు రాజు నాలుగు సంవత్సరాలుగా నల్లా బాబండి వద్ద మకాం కూలీగా పనిచేస్తున్నాడు. బాబండి కుమారుడైన నవీంద్ర కొంతకాలంగా పని విషయంలో రాజును శారీరకంగా హింసిస్తున్నాడు. శనివారం అప్పజెప్పిన పని ముగించుకొని వచ్చినప్పటికీ మరో పని చేయాలని వేధించాడు. సరే అని పని చూసుకొని వెళ్లే లోపు దౌర్జన్యంగా కుల ప్రస్తావనతో బూతులు తిడుతూ చితకబాదాడు. కాలితో తన్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు, చెల్లెలతో మకాంలో కాపురం ఉంటున్నానని, నన్ను కొట్టే సమయంలో నా కుటుంబ సభ్యులు అడ్డువచ్చి బతిమాలాడినా కనికరించకుండా, వారిని చంపేస్తానని బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇంకా కేసు నమోదు కాలేదు.

ఎమ్మెల్యే అశోక్‌కు సత్కారం



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న పీడబ్ల్యూడీ సిబ్బంది

యానాం: యానాం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్(పీడబ్ల్యూడీ) శాఖలో ఎన్ఎంఆర్‌లుగా పనిచేస్తున్న సిబ్బంది జీతాల పెంపునకు కృషి చేసినందుకు పలువురు సిబ్బంది ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి రూ.10 వేల జీతానికి తాము పనిచేస్తున్నామని ఎమ్మెల్యే అశోక్ కృషి కారణంగా అది కాస్తా రూ.రూ.18 వేలకు పెంచారన్నారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ పీడబ్ల్యూడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. యానాం విద్యాశాఖలో మిల్క్ బాయిలర్స్‌గా 20 ఏళ్లుగా విద్యార్థులకు పాలు కాచి పంపిణీ చేస్తున్న తమకు రూ.10 వేల నుంచి రూ.18 వేలకు జీతం పెరగడానికి ఎమ్మెల్యే అశోక్ కృషే కారణమని ఆయనను ఆదివారం ఘనంగా సత్కరించారు. అసెంబ్లీలో తమ తరపున సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకెంతో మేలు చేశారని కొనియాడారు.

ఇంటింటా సంక్షేమ సందడి



అమలాపురంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్



రెడ్డిపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి తదితరులు



పి.మల్లవరం పంచాయతీలో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాలు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ 30 వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు మూడో రోజైన ఆదివారం ఇంటింటా సంక్షేమ సందడితో సాగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి జగన్ పాలనలో నాలుగేళ్ల సంక్షేమ సమాచారాన్ని తెలయజేస్తున్నారు. ఆ ఇంట్లో వారి ఫోన్ నుంచే 82960 82960 అనే ఫోన్ నెంబరుకు మిస్డ్ కాల్ ఇస్తున్నారు. వెంటనే ఆ ఫోన్‌కు సీఎం జగన్ రికార్డ్ వాయిస్ రావడంతో ఇంటింటా ఆ జన నేత మాటలు వింటున్నారు. స్థానిక 9వ వార్డులో మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఈతకోట శ్రావణ్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు.

ఊరూవాడా ఉత్సాహం

తాళ్లరేవు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజలనుంచి విశేష స్పందన వస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్‌లు అన్నారు. ఆదివారం పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని గ్రాంటు, మూలపాలెం, చినపేట గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, మండల సచివాలయాల కన్వీనర్ దున్నా సత్యశ్రీకాంత్, నాయకులు పంపన రామకృష్ణ, బల్ల బేబీప్రసాద్, దడాల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లి గ్రామంలో..

అమలాపురం రూరల్: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ కరాటం ప్రసన్నప్రవీణ్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.

మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి హరిరామ్‌గోపాల్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి తదితరులు గడపగడపకూ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించి ఇంటింటికీ జగనన్న స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చొల్లంగి సుబ్బిరామ్, కరాటం దొరబాబు, ఉప సర్పంచ్ రేలంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ విజయవంతం చేయండి

కాట్రేనికోన: మండలంలో ఈ నెల 11 నుంచి జరిగే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం కాట్రేనికోనలో సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ ఇంటిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాట్రేనికోన పంచాయతీ పరిధిలో మూడు రోజుల పాటు జరిగే గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్ని వివరిస్తారని చెప్పారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

తాగునీరివ్వడమే లక్ష్యం



బెండమూర్లంకలో కుళాయిలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి

ఉప్పలగుప్తం: ఇంటింటికీ సురక్షితమైన తాగునీర్విడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి అన్నారు. మండలంలోని బెండమూర్లంక గ్రామంలో సర్పంచ్ బర్రె సీతారత్నం ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటుచేసిన తాగునీటి కుళాయిలను ఆదివారం ప్రారంభించారు. నందమూరిలంక గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, వైస్ ఎంపీపీ ముత్యాల వెంకట రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ తిక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైరస్ సోకి పందుల మృతి

యానాం: నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ నగర్, అయ్యన్న నగర్ గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులకు గత కొద్దిరోజులుగా గుర్తు తెలియని వైరస్ సోకి మృత్యువాత పడుతున్నాయి. అవి నివాస ప్రాంతాల్లో చనిపోతుండడంతో కళేబరాల దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి పందుల కళేబరాల్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మృతి చెందిన పందుల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశముందని, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానికుడైన దాసరి శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు.

ఘనంగా దళిత ఐక్యతా ర్యాలీ

తాళ్లరేవు: మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దళిత ఐక్యతా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద గల అంబేడ్కర్, బాలయోగి విగ్రహాలకు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దున్నా జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్‌లు పూలమాలలు వేశారు. అనంతరం వారు జెండాలు ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జనార్దనరావు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించేందుకు దళిత గ్రామాలను సిద్ధం చేయడానికే ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంటపల్లి చంద్రమౌళి, దున్నా సుబ్రహ్మణ్యం, ఊడా వెంకటరమణ, కాశి లక్ష్మణస్వామి, జక్కల ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

అరెస్ట్ చేసినవారిని కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్

అమలాపురం రూరల్: అమలాపురం అల్లర్ల ఘటనలో అరెస్టు చేసినవారిని కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా దళిత ఐక్యవేదిక, యువజన విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఆదివారం అమలాపురం ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో దళిత ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్ మాట్లాడుతూ మాట్లాడుతూ నిందితులపై కేసులు ఎత్తివేస్తామని ప్రకటన చేయడం చట్టాలను నీరు గార్చడమేనన్నారు. ఘటనకు కారకులైన సూత్రధారులను గుర్తించి హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబురావు, గిడ్ల వెంకటేశ్వరరావు, రేవు తిరుపతిరావు, జక్కల అరుణ్ కుమార్, మెండు రమేష్‌బాబు, నక్కా సంపత్ కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మార్పణ్ పథకానికి రూ.10 వేల విరాళం

తాళ్లరేవు: తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మార్పణ్ ఉచిత భోజన పథకానికి దాత మంజులూరి విశ్వేశ్వరరావు, రమాసుందరి దంపతులు రూ.10 వేల విరాళాన్ని అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు బొళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడలో జరిగిన డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మీటింగ్‌లో ఈ మేరకు నగదును తాళ్లరేవు లయన్స్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయిక సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ

అమలాపురం రూరల్: పేరూరు డీఎస్ శెట్టి–డీవీ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996–97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం జరిగింది. 26 ఏళ్ల తరువాత కలుసుకున్న చిన్ననాటి మిత్రులంతా ఒకరినొకరు పలకరించుకుంటూ పాఠశాలలో చదువుకునే రోజులనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధానోపాధ్యాయురాలు నూలు అన్నపూర్ణ మాట్లాడుతూ నాటి విద్యార్థుల్ని, సహ ఉపాధ్యాయుల్ని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం పూర్వపు విద్యార్థులంతా కలిసి తమ గురువుల్ని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. దురదృష్టవశాత్తూ చనిపోయిన 11 మంది చిన్ననాటి మిత్రుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థిక సాయం చేశారు.

కరెంట్ చార్జీలు 4.69 శాతం పెరుగుదల

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ చార్జీలు సరాసరిన 4.69 శాతం పెంచుతూ ఆదివారం గోవా, కేంద్ర పాలిత ప్రాంతాల జాయింట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఆమోదించింది. 50 యూనిట్ల ఒన్ హౌస్, ఒన్ బల్బ్ సర్వీసులకు యూనిట్‌కు రూ.1.25 నుంచి రూ.1.45 పెంచారు. అదే విధంగా గృహ, కాటేజ్ ఇండస్ట్రీస్, పౌల్ట్రీ ఫామ్స్, హార్టికల్చర్ తదితరవాటికి 100 యూనిట్ల కన్నా తక్కువ ఉంటే రూ.1.90 నుంచి రూ.2.25 పెంచారు. 101 యూనిట్ల నుంచి 200 యూనిట్ల వరకూ రూ.2.90 నుంచి రూ.3.25, 201 యూనిట్ల నుంచి 300 యూనిట్ల వరకూ రూ.5 నుంచి రూ.5.40, 300 యూనిట్లు పైబడితే రూ.6.45 నుంచి రూ.6.80కు పెంచారు.

ఎమ్మెల్సీకు ఘన సత్కారం

ఉప్పలగుప్తం: ఎమ్మెల్సీగా విజయం సాధించి మండలంలోని గొల్లవిల్లి గ్రామానికి విచ్చేసిన బొమ్మి ఇజ్రాయిల్‌ను సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, చిన్ని దంపతులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి మళ్లీ జగన్‌ను సీఎం చేసేలా కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెయ్యిల రమణ, చేట్ల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ పండగ



యానాం అంబేడ్కర్ నగర్ బాప్టిస్టు చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు



అమలాపురం మన్నా చర్చిలో ఈస్టర్ సందేశాన్ని వింటున్న క్రైస్తవులు



ఈస్టర్ పండగను దృశ్య రూపంలో ప్రదర్శిస్తున్న యువతీ యువకులు

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన వద్ద గల మన్నా జూబ్లీ చర్చిలో ఈస్టర్ పండగ ఆదివారం ఘనంగా జరిగింది. అమలాపురం మన్నా మినిస్ట్రీస్ విద్యాసంస్థల అధినేత, జూబ్లీ చర్చి ప్రధాన కాపరి కార్ల్ డేవిడ్ కొమానపల్లి, బిట్రగుంట నుంచి వచ్చిన జి.ఐజియ్య ఈస్టర్ సందేశాలిచ్చారు. క్రీస్తు పునరుద్ధనంలో జరిగిన వివిధ సంఘటనలను వివరించారు. పాస్టర్లు ఎర్నెస్ట్ తాతపూడి, ఎస్తేర్ తాతపూడి తమ సందేశాల్లో క్రీస్తు మరణాన్ని జయించి సజీవుడిగా లేచిన సంఘటనల గురించి చెప్పారు. ఈ సందర్భంగా యువతీ యువకులు ప్రదర్శించిన క్రీస్తు గీతాలాపన అందరినీ ఆకట్టుకుంది. కొరియోగ్రఫీతో ఈస్టర్ సంఘటనలను దృశ్య రూపంలో, లఘు నాటికల రూపంలో చేసిన ప్రదర్శన అలరించింది. కోనసీమలోని వివిధ గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన క్రైస్తవులతో చర్చి కిటకిటలాడింది.

ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ

అల్లవరం: మండలంలోని గోడితిప్ప గ్రామంలో క్రీస్తు ఆరాధన పరిచర్య చర్చి పాస్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ తన సతీమణితో కలిసి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ దంపతులను చర్చి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగాభవాని, కొల్లు దుర్గ తదితరులు పాల్గొన్నారు.

తెల్లవారుజాము నుంచే ప్రార్థనలు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని పలు చర్చిల వద్ద క్రైస్తవ సోదరులు ఏసుక్రీస్తు పునరుత్థానం చెందిన రోజును పురస్కరించుకుని ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే క్రైస్తవ సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. స్థానిక రోమన్ కేథలిక్ చర్చిలో పాదర్ మరియదాసు ఈస్టర్ సందేశానిచ్చారు. ఏసు క్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచిన అద్భుతాన్ని కొనియాడుతూ ఏసుక్రీస్తు జీవితం అందరికీ అనుసరణీయమని చెప్పారు. అంబేడ్కర్‌నగర్ బాప్టిస్టు చర్చిలో పాస్టర్ ఎల్.ప్రవీణ్‌కుమార్ ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు. కురసాంపేట రివైవల్ చర్చిలో పాస్టర్ జోసఫ్ ఆధ్వర్యంలో, మెట్టకూరులో పాస్టర్ శామ్యూల్ సాగర్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు జరిపారు. పరంపేట, దరియాలతిప్ప, గాంధీనగర్, భీమ్‌నగర్, ఫ్రాన్స్ తిప్ప తదితర ప్రాంతాల చర్చిల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి.

శ్రీదేవి కుటుంబానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పరామర్శ

గోడి గురుకుల పాఠశాలలో పిల్లల చదువులకు ఏర్పాట్లు



శ్రీదేవి కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: అమలాపురం ఏఎంజీ కాలనీలో నెల్లూరువాసి తన చాటింగ్ ప్రేయసి అనుకుని పని మనిషి శ్రీదేవిని హత్య చేసిన ఘటన చాలా బాధాకరమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని శ్రీదేవి ఇంటికి వెళ్లి వారి కుటుంబీకులను ఎమెల్సీ ఇజ్రాయిల్ ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా న్యాయం చేసేందుకు మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో మాట్లాడతానని చెప్పారు. శ్రీదేవి ఇద్దరు కుమార్తెలను అల్లవరం మండలం గోడి గురుకుల పాఠశాలలో చదివించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత సాయంగా బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందించారు. ఆయన వెంట స్థానిక వార్డు కౌన్సిలర్ బంగారు గోవిందు, వైఎస్సార్ సీపీ నాయకుడు యండమూరి శ్రీను, మున్సిపల్ కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ, పాపగంటి కోటి, చప్పిడి సతీష్ తదితరులున్నారు.